క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తెలకపల్లి: మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధించుటకు తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపట్టామని ఆర్‌సీఓ వెంకట్ రెడ్డి, తెలకపల్లి మహాత్మ జ్యోతిరావుపూలే కళాశాల ప్రిన్సిపాల్ భద్రన్న బుధవారం తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్రం, కెమిస్ట్రీ, బయోలజి, బోటని సబ్జెక్టులను బోధించుటకు పీజీ, బీఎడ్ కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దగ్గరలో ఉన్న మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో జూలై 3లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉయ్యాలవాడ బీసీ గురుకుల బాలికల పాఠశాలలో గణితం, సాంఘికశాస్త్రం, సామాన్య, ఫిజిక్స్, కల్వకుర్తి బీసీ గురుకుల పాఠశాలలో హిందీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజి, సామాన్యశాస్త్రం జూలై 5వ తేదీన ఉదయం 8 గంటల నుంచి 4:30 గంటల వరకు డెమోలు ఉంటాయన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

కల్వకుర్తి: పట్టణంలోని శాలివాహన సంఘం భవనం కాంపౌండ్ వాల్‌తో పాటు సిలార్‌పల్లి నుంచి ఎల్లికల్ వెళ్లే డొంకరోడ్డు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శాలివాహన సంఘం సభ్యులు బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యానికి మున్సిపల్ కార్యాలయంలో వివరించారు. స్పందించిన చైర్మన్ సమస్యను ఫోన్ ద్వారా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వివరించారు. కాంపౌండ్ వాల్‌కు రూ.5లక్షలతో పాటు డొంక రోడ్డు మరమ్మతుకు మరో రూ.5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం, జగదీష్, సత్యం, మధు, శ్రీనివాసులు, పర్వతాలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం చెందిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నివాసంలో 30 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్, రామచంద్రం, సర్పంచ్ దశరథంనాయక్ తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

వెల్దండ: మండలంలోని పల్గుకిందితండాకు చెందిన రాజుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.28వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీ రాములు బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మైసయ్య తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ చెందిన బుగ్గన్న హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం స్థానిక రూ.లక్ష ఎల్‌ఓసీని కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు.

పెద్దకొత్తపల్లి: మారేడుమాందిన్నెకు చెందిన బాలస్వామికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును జెడ్పీటీసీ మేకల గౌరమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని ఫెస్టిసైడ్ దుకాణాదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలతోపాటు రసాయనిక ఎరువులను విక్రయించి రశీదు తప్పనిసరి ఇవ్వాలని ఏఓ సాయిరమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని ఆకునెల్లికుదురు, మేడిపూర్‌లో పలు దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను, ఎరువులు, విత్తనాల నిల్వలు పరిశీలించారు. సేకరించిన విత్తనాలను ల్యాబ్‌కి పంపిస్తామన్నారు.

అధికారులతో సమీక్ష

చారకొండ: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులతో ఎంపీడీఓ జయసుధ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చించారు. బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం అందించేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న పత్రాలను ఈనెల 30 వరకు స్వీకరించాలన్నారు. గ్రామాల్లో కమ్యూనిటీ, ఇంకుడు గుంతలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ, కూలీలు తదితర వాటిపై సమీక్షించారు. ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య ఉన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

బిజినేపల్లి: పీఎం కిసాన్ నిధి ద్వారా లబ్ధి పొందలేకపోతున్న రైతులకు ఈ-కేవైసీని వ్యవసాయశాఖ అధికారులే చేస్తారని ఏవో నీతి బుధవారం ప్రకటనలో తెలిపారు. జూన్ 30వ తేదీ వరకు ఈ-కేవైసీ లేని రైతులు ఏఈవోలను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. కొంత మంది రైతులు ఆధార్‌కార్డ్‌కు ఫోన్ నంబర్ లింక్ లేకపోవడం, వేలిముద్రలు రాకపోవడం వివిధ రకాల కారణాల ద్వారా రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేకపోతున్నారని, వారికోసం క్లస్టర్ ఏఈఓలే ఫేస్-ఈ కేవైసీ చేస్తారని పేర్కొన్నారు. మండలంలో 1,174 మంది రైతులకు ఈ-కేవైసీ లేదని ఏవో తెలిపారు.

సరుకుల పంపిణీ

కొల్లాపూర్: బక్రీద్ పర్వదినం సందర్భంగా పలువురు పేద ముస్లింలకు సురగౌని శ్రీనివాస్‌గౌడ్ పంపిన సరుకులను పట్టణంలోని పలు వార్డుల్లో స్థానిక నాయకులు అందజేశారు. వేడుకల సమయంలో నిత్యావసరాలకు ఇబ్బందులు ఉండకూడదనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నయూమ్, యువకులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఈద్గా, మసీదులు



సామూహిక ప్రార్థనలకు ముస్తాబవుతున్న నాగర్‌కర్నూల్ శ్రీపురం రోడ్డులోని ఈద్గా

- ఏర్పాట్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

కందనూలు: బక్రీద్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలకు జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ఈద్గా ముస్తాబైంది. బుధవారం మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈద్గా పరిసరాలను శుభ్రం చేశారు. ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. బక్రీద్‌కు ముస్లింలు కొత్త దుస్తులు, కిరాణం సామగ్రి కొనుగోలు చేయడానికి అధిక సంఖ్యలో మార్కెట్లకు రావడంతో సందడి నెలకొంది. పట్టణంలోని జామే మసీద్, వక్ఫ్ కాంప్లెక్స్ మసీద్, పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న మసీదులను సర్వాగ సుందరంగా ముస్తాబు చేశారు. పండుగను పురస్కరించుకొని ఖుర్బానీ ఇవ్వాటానికి ముస్లింలు గొర్రెలు, మేకలు కొనేందుకు పోటీపడ్డారు. ఈద్గాల వద్ద జరిగే సామూహిక ప్రార్థనల్లో ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ముందు జాగ్రత్తగా జిల్లా కేంద్రంలో పోలీసులు భద్రత పెంచారు.

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని కుమ్మెరలో కొత్తగా నిర్మాణం చేపట్టిన ఈద్గా పనులు పూర్తి కాగా బక్రీద్ పండుగ సందర్భంగా నమాజ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని మసీద్ కమిటీ అధ్యక్షుడు షబ్బీర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ యూసూఫ్, బాబ తెలిపారు.

కల్వకుర్తి టౌన్: బక్రీద్ పండుగ సందర్భంగా మున్సిపాలిటీలోని ఈద్గాల వద్ద ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లతో కలిసి పరిశీలన చేశారు. ఈద్గాల వద్ద ఇబ్బంది లేకుండా తరపున అన్ని చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. వారి వెంట కమిషనర్ అశ్రిత్‌కుమార్, ఏఈ శివకృష్ణ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పీవీ నర్సింహరావుకు ఘన నివాళి



పీవీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

కందనూలు: పీవీ నర్సింహరావు జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ.. అన్ని రంగాలలో దేశం వెనుకబడి ఉన్న సమయంలో పీవీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, తన మేధాసంపత్తి ద్వారా పరిపాలన సాగించి విప్లవాత్మక ఆర్థిక, పారిశ్రామిక, విదేశాంగ, వ్యవసాయిక విధానాల ద్వారా దేశాన్ని అభివృద్ధి పరిచారన్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రావు, వెంకట్‌రావు, భూదానం, రాజశేఖర్‌రావు, ప్రకాష్, దుర్గి శ్రీకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో నాయకులు వల్లభ్‌రెడ్డి, తైలి శ్రీనివాసులు, భాస్కర్ ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఇళ్ల స్థలాల భూమిని పేదలకు పంచండి

పెంట్లవెల్లి: మండల ప్రజల కోసం గతంలో కొన్న భూమిని నిరుపేదలందరికీ వెంటనే పంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో కొత్తబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్ఐ హన్మంతుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 22, 27లో దాదాపు 17ఏళ్ల క్రితం 14 ఎకరాల 36 కుంటల భూమిని అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిందన్నారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేయలేదని, ఇప్పటికైనా ప్రజలందరికి స్థలాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో హన్మంతు, రమణ, రఫీ, ప్రమీల, కృష్ణయ్య, రవి, రాములు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, ప్రజలు

కళాకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న మీసాల రాము

కొల్లాపూర్: జానపద కళాకారులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ దండోరా, జానపద కళాకారుల సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కళాకారులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలల క్రితం కళాకారులకు దళితబంధు, బీసీ కళాకారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, కళాకారులందరికీ కలిపి కళాభవన్‌ను నిర్మించి కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. ఇప్పటివరకు ఒక్క హామీ నెరవేర్చేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. జూలై 2 వతేదీ వరకు దీక్షలు కొనసాగిస్తామని అప్పటివరకు ఎమ్మెల్యే స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాములు, గోపి, నాగరాజు, నర్సింహ, రామకృష్ణ, జ్యోతి తదితరులున్నారు.

కళాశాలల్లో భోజనం అందించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని బీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇంటర్ నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు పూర్తి చేసుకున్న సర్టిఫికెట్లు అడిగితే ప్రైవేట్ కళాశాలల యజమానులు వారి నుంచి పెండింగ్ ఫీజులు వసూలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, చందు, సురేందర్, మహేష్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

కల్వకుర్తిరూరల్: జిల్లాలోని పింఛన్ల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. జూలై 12న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, బాలయ్య, గోవర్ధన్, అంజనయ్య, వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

కోడేరు: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో హైదరాబాద్ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాసభ ఏర్పాటు చేస్తున్నామని మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుర్మయ్య, తిరుపతయ్య, రమేష్, బాలరాజు, బాలపీరు పాల్గొన్నారు.

చెరువు నుంచి నీటి విడుదల



బిజినేపల్లి: మండలంలోని పాలెం చెందిన పెంటోని చెరువు నుంచి ఆయకట్టుకు సాగునీటిని బుధవారం ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ విడుదల చేశారు. పాలెం పెంటోని చెరువు నుంచి తూము తెరిచి పంట పొలాలకు పాటు కాల్వల ద్వారా నీళ్ల విడుదల చేశారు. ఈ చెరువు కింద దాదాపు వెయ్యి ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందనుందని, వరి నాట్లకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లావణ్య, సుగుణమ్మ, నాయకులు రాములు, యాదవరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, స్వామి పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు పురస్కారం

తాడూరు: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఒక్కొక్క విద్యార్థికి రూ.1,116, మెడల్స్‌తో బుధవారం సన్మానించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అంజయ్య అధ్యక్షతన నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తే గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగామోహన్, సర్పంచ్ ఇందుమతి, క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, రాజయ్య, వెంకటేష్, శ్రీనివాసులు, తిరుపతయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

రఘుపతిపేట మండల కేంద్రం అయ్యేనా?

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటను మండల కేంద్రంగా మార్చాలని గతంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీలకతీతంగా జేఏసీగా ఏర్పడి మండలం కోసం ఆరు నెలలు ఉద్యమించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తే రఘుపతిపేటకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యమాన్ని విరమించారు. ప్రభుత్వం నియోజకవర్గంలోని ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో రఘుపతిపేట పరిసర గ్రామ ప్రజలు తిరిగి పునరాలోచన మొదలుపెట్టారు. కొత్తమండలాలు ఏర్పాటు చేస్తే రఘుపతిపేటను మండల కేంద్రంగా ఇస్తామని హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మండల సాధన కోసం మరో సారి ఉద్యమ కార్యచరణ చేపడుతామని పలువురు నాయకులు చెబుతున్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



ఆంజనేయులు

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి సీఐగా ఆంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన పార్థసారధి బాధ్యతలు అప్పగించారు. ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఆంజనేయులు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహన చేస్తానని ఆయన తెలిపారు. కల్వకుర్తి, ఊర్కొండ ఎస్ఐలు సీఐని కలిసి శుభాకాంక్షలు తెలపగా, అనంతరం డీఎస్పీ గిరిబాబును సీఐ కలిశారు.

అన్నదమ్ములపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని పోతేపల్లికి చెందిన వావిళ్ల పెద్దబాలయ్య, వావిళ్ల చిన్నయ్య అన్నదమ్ములు భూ వివాదంలో దాడిచేసుకోవడంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారు. ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఇద్దరి భూములు ఎక్కువ, తక్కువలు ఉండడంతో సమానంగా పంచుకోవాలని గొడవలకు దిగారు. దీంతో వారికి గాయాలైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సారా తరలిస్తున్న మహిళపై..

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి సమీపంలోని చీకటివాగు వద్ద బుధవారం సాయంత్రం సారా తరలిస్తూ కాంసానిపల్లి తండాకు చెందిన కాట్రావత్ తకాలి పట్టుబడినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఆమె వద్ద నుంచి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై..

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లో ఈనెల 24న సంగి ప్రహ్లాద్‌పై అదే గ్రామానికి చెందిన తైలి శివ దాడిచేసి గాయపర్చినట్లు బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

భూ ఆక్రమణపై..

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల శివారులో కేతావత్ లలితకు చెందిన భూమిని కొంతమంది ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. లలిత వ్యవసాయ పొలంలోకి పక్కపొలానికి చెందిన మర్రిగుంతతండా రైతులు వ్యవసాయ భూమి ఆక్రయించారు. భూమి ఎందుకు ఆక్రమించారని లలిత ప్రశ్నించగా నలుగురు దాడిచేసి గాయపరిచారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కల్వకుర్తి టౌన్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బుధవారం తెలిపారు. పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండలంలోని సుద్దకల్ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పరిశీలించగా అనుమతులు లేకపోవటంతో వాటిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

రాజకీయ నాయకులతో సమీక్ష

కల్వకుర్తిరూరల్: రాబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంరెడ్డి బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో విజయ్‌గౌడ్, సురేందర్‌గౌడ్, మల్లేష్, పరశురాములు, ఆంజనేయులు, కృష్ణ గౌడ్ హాజరయ్యారు.

పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలోని పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయమని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని మార్చాలలో ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 330 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న పది మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించేందుకు భూమి పూజ చేశారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో గ్రూప్-4 పరీక్ష కేంద్రం ఏర్పాట్లపై బుధవారం తహసీల్దార్ రవికుమార్, మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్ పరిశీలించారు. పరీక్ష కేంద్రానికి 701మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిన తెలిపారు.

పుస్తకాల వితరణ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు వేముల నారాయణ పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. దీనిపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ మధు

తెలకపల్లి: గ్రామాలలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీపీ మధు సూచించారు. బుధవారం మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాన్ని ఎప్పటికప్పుడు సందర్శిస్తూ పారిశుద్ధ్యంపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, గ్రామాలలో మురుగు నిల్వకుండా చూడాలన్నారు. ఎలాంటి అపరిశుభ్రత ఉన్నా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందని వాటిని నివారించాలని సూచించారు. అవసరమైన చోట డ్రెయినేజీలు, సీసీ రోడ్లు గుర్తించి మంజూరైతే పనులు చేయించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రతి రోజు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండడమే కాకుండా, డ్రెయినేజీలను శుభ్రం చేయించడం, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, విజయలక్ష్మి, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ వెంకటయ్య పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్దాం



మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

కల్వకుర్తి టౌన్: పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన కొనసాగింది. సమావేశ అనంతరం కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సమావేశ వివరాలను విలేకరులకు వెల్లడించారు. సమావేశంలో పారిశుద్ధ్య నిర్వహణకు రూ.30 లక్షలతో 5 ఆటోలు, మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డీఆర్‌సీసీ సెంటర్‌కు బయోగ్యాస్ ప్లాంట్ మిషనరీ కొనుగోలుకు రూ.50 లక్షలకు ముందస్తు తీర్మానాలు చేశామని తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలకు ముందస్తుగా చెల్లించిన రూ.5 లక్షలు చెల్లించటంతో పాటుగా, బక్రీద్, బోనాల పండుగ నిర్వహణకు సంబంధించి బడ్జెట్ విడుదలకు తీర్మానాలు చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఏఈ శివకృష్ణ, టీపీఓ విజయ్, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగసాగు పరిశీలన

పెద్దకొత్తపల్లి: వానాకాలంలో రైతులు వరినాట్లు వేసుకునే ముందు జీలుగసాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని గోపాలనాగరాజు రైతు వ్యవసాయ పొలంలో వేసిన జీలుగ పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీలుగ వేసుకోవడం ద్వారా నేలకు పచ్చిరొట్ట ఎరువు అందడమే కాక అధిక దిగుబడి వస్తుందన్నారు. విత్తనాలు ఎకరాకు 10 నుంచి 12 కిలోలు ఇసుకలో కలిపి పొలంలో చల్లుకుంటే 9 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు. జీలుగ వేసినప్పుడు వాటి వేళ్లు భూమిలోతులోకి వెళ్లడంతో అనేక పోషకాలను వెలికి తెచ్చి పంటలకు అందిస్తుందన్నారు.



చిరుధాన్యాల పంటలు ఎంతో మేలు



అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: ప్రస్తుత పరిస్థితుల్లో వాణిజ్య పంటల కన్న చిరుధాన్యాల పంటలు ఎంతో లాభదాయకమని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. కోనేర్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శాయిన్‌పేటలో చిరుధాన్యల పంటల సాగుపై బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు లేదా భూమిలో లోపించిన సారం మూలంగా వాణిజ్య పంటలు సాగు చేయడం కష్ట సాధ్యమని తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఇచ్చే పచ్చజొన్న, కందులు, రాగి జూలై 15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈ పంటల సాగుకు అంతగా పెట్టుబడులు, ఎరువుల వాడకం ఉండదని, ఎంతో ఆరోగ్యకరమైన పంటలని తెలిపారు. మార్కెట్‌లో చిరుధాన్యలకు ఎంతో డిమాండ్ ఉందని చెప్పారు. రసాయన ఎరువులు వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రీయ పద్ధతిలో కషాయాలు వాడాలన్నారు. కషాయాల తయారీ గురించి అవగాహన కల్పించారు. ఏటా ఒకే రకమైన పంట కాకుండా మార్పిడి పద్ధతి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దులు, భగత్, ఇస్మాయిల్, చంద్రశేఖర్, రాము, ఏఈఓ నరేష్, ఉప సర్పంచ్ ఇంద్రగౌడు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీ అరికట్టాలని రైతుల నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని రైస్‌మిల్లర్లు రైతులను తరుగు పేరుతో నిలువునా దోచుకుంటున్నారని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ ఆరోపించారు. బుధవారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని తర్నికల్, ఇతర ప్రాంతాల రైతులతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం రైతులతో తరుగు తియొద్దని చెబుతున్నా, మిల్లర్లు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకపోవటం దుర్మార్గమని అన్నారు. మిల్లర్ల బాగోతంపై పలుమార్లు రెవెన్యూ అధికారులతో పాటుగా, ఇతర శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అధికారులు ఇప్పటికైనా రైతుల కష్టాలను తెలుసుకుని, న్యాయం చేయాలన్నారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వారిని సముదాయించి నిరసనను విరమింపజేశారు.

పోడు రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న దేశ్యానాయక్

అచ్చంపేట రూరల్: పోడు భూములు సాగు చేస్తున్న, దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో వస్తే పోడు భూములు సాగు చేసుకుంటున్న ప్రతి రైతుకు హక్కుపత్రాలు ఇస్తామని చెప్పి 9ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఇవ్వలేదన్నారు. ఈనెల 30న పత్రాలు ఇస్తామని ప్రచారాలు చేసుకుంటున్నారని, కొందరికి మాత్రమే ఇస్తే ఊరుకోమన్నారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, మల్లేష్, సైదులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

అచ్చంపేట రూరల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని షీ టీం ఇన్‌చార్జ్ ఇందిర తెలిపారు. బుధవారం పట్టణంలోని సాయినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనార్థాలు వస్తాయన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జీహెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌నాయక్, పాండు, రోజా పాల్గొన్నారు.